సిబ్బంది భయపడుతున్నారు



రాత్రి సమయాల్లో డ్యూటీలో ఉండే మహిళ వైద్యులు, వైద్య సిబ్బందికి ఆస్పత్రిలో తగిన సౌకర్యాలు కల్పించాలి. కలకత్తాలో జరిగిన ఘటనతో సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు సమాజంలో ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలి. ప్రజలకు సేవ చేయాలని వైద్య వృత్తిని ఎంచుకున్న యువతిపై దారుణానికి ఒడిగట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలి. మహిళలకు రక్షణ కల్పించేవిధంగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ శ్రవంతి, తొగరాం పీహెచ్‌సీ వైద్యురాలు, ఆమదాలవలస



కఠిన చర్యలు ఉండాలి



దేశవ్యాప్తంగా వైద్యశాఖలో పనిచేసిన వారిలో దాదాపు 40 శాతం పైబడి మహిళలే ఉన్నారు. వారికి కనీస రక్షణ లేదు. ప్రధానంగా రాత్రిపూట విధులు నిర్వహించేటప్పుడు ఎటువంటి భద్రత ఉండడం లేదు. పోలీస్ పెట్రోలింగ్ ఖచ్చితంగా ఏర్పాటు చేయాలి. కలకత్తా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ప్రతీ వైద్యశాల వద్ద సెక్యూరిటీ గార్డ్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. అలాగే క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించేటప్పుడు మద్యం సేవించి వేధించేవారిపై చర్యలు తీసుకునేలా చట్టాలు ఉండాలి.

– పూజారి సుజాత, మెడికల్ అధికారి, అచ్యుతాపురం పీహెచ్‌సి

క్లుప్తంగా

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



నినాదాలు చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నరసన్నపేట: మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం అవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. యూనివర్సిటీ అధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రధాన వీధుల్లో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో వ్యసనాలకు గురైతే చదువుపై దృష్టి పెట్టలేరని, కలలు నెరవేర్చుకోలేరన్నారు. యువత అంతా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

పెద్దదూగాంలో ఎల్‌సీడీసీ సర్వే



సర్వే పరిశీలిస్తున్న సురేష్ కుమార్

జలుమూరు: అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆశా ఆధారిత నివేదిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి నివేదించాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ కుమార్ అన్నారు. శనివారం పెద్దదూగాంలో ఎల్‌సీడీసీ సర్వేను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశాలే కీలకమని పేర్కొన్నారు. రక్తపూత నమూనాలు, జ్వరాలు తదితర సర్వేలు చేయాలన్నారు. ఆయనతో పాటు వైద్య సిబ్బంది చిన్నారావు తదితరులు ఉన్నారు.

ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం నేడు

ఎల్.ఎన్.పేట: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని రైతు బజారు జంక్షన్ సమీపంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ మందిరంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దకోట వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి ఉంగటి వెంకటరమణ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. అన్ని మండలాల్లోని కార్యవర్గ సభ్యులు, మండల శాఖ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణకు నిధులు

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం రూ.29.71 లక్షల నిధులను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పురపాలక సంఘంలో 23 వార్డుల్లోని కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని అధికారులకు ఆదేశించగా పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే ఆ నిధుల్లో కొంత మొత్తాన్ని సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు కొత్త స్ప్రేయింగ్ మిషన్లు ఏడు, ఫాగింగ్ మిషన్లు రెండు, బ్లీచింగ్ తదితర సామగ్రిని కొనుగోలు చేయాలని సూచించారు. పురపాలక సంఘానికి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి పి.నారాయణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గుణాత్మక విద్యనందించాలి

జలుమూరు: విద్యార్థులకు ఉపాధ్యాయులు గుణాత్మక విద్య అందించాలని మండల విద్యాశాఖ అధికారులు బి.మాధవరావు, ఎంఆర్‌పీ ప్రసాదరావులు అన్నారు. శనివారం టెక్కలిపాడు, గొళియాపుట్టి యూపీ, ప్రాథమిక పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా చదువులో వెనకబడిన విద్యార్థులను గుర్తించి బోధన చేయాలన్నారు. ఎక్కువగా పాఠ్యాంశాలు రాయడం అలవాటు చేయడం ద్వారా వారు సులువుగా విషయాలు గుర్తించుకుంటారన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించి, నాణ్యత, శుభ్రత పాటించాలని స్పష్టం చేశారు.

దివ్యాంగ విద్యార్థికి వీల్‌చైర్



విద్యార్థికి వీల్ చైర్ అందజేస్తున్న గోవిందరావు

పొందూరు: మండలంలోని అచ్చిపోలవలస గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థి బి.మహేష్‌కు జిల్లా సహిత విద్యా కో–ఆర్డినేటర్ వీల్‌చైర్‌ను శనివారం అందించారు. గృహ ఆధారిత విద్య పరిశీలనలో భాగంగా దివ్యాంగ విద్యార్థికి దీనిని అందజేశారు. కార్యక్రమంలో అచ్చిపోలవలస పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, మండల భవిత కేంద్రం రీసోర్స్ పర్సన్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..!



పాతపట్నం: గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణల్లో చిన్నారులు



సారవకోట: అవలింగి జేబీటీ పాఠశాల విద్యార్థులు పూలతో శ్రీకృష్ణుడి చిత్రపటం వేసిన దృశ్యం

ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవరాల్లోని పలు పాఠశాలల్లో ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు. చిన్నారుల వేషధారణలు చూసిన తల్లిదండ్రులు ఆనందంతో మురిసిపోయారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: వేడుకల్లో పాల్గొన్న చిన్న కృష్ణులు



నరసన్నపేట: వేషధారణలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పొందూరు: ఉట్టి కొడుతున్న చిన్నారులు

హాస్టల్‌లో సమస్యల తిష్ట..!

- తలుపుల్లేని కిటికీలు
- ట్యాప్‌లు లేని కుళాయిలు
- దోమలతో సహజీవనం



వేలాడుతున్న విద్యుత్ వైర్లు



హాస్టల్ భవనం



హాస్టల్ గదులకు తలుపుల్లేని కిటికీలు



ట్యాపుల్లేని కొళాయిలు



స్లాబులు ఊడి శిథిలమైన హాస్టల్ భవనం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహానికి సవాలక్ష సమస్యలు వెంటాడుతున్నాయి. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకునేందుకు ఎంతో దూరం నుంచి వచ్చి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు దోమలతో సహజీవనం చేస్తున్నారు. హాస్టల్ విద్యార్థులు ఉండే గదుల కిటికీలకు తలుపులు లేకపోవటంతో విద్యార్థులు వాడుకునే బట్టలు కిటికీలకు కట్టి రాత్రులు గదుల్లో నిద్రపోవాల్సిన పరిస్థితి నెలకొంది. హాస్టల్ భవనంలోని డైనింగ్ హాల్ స్లాబు శిథిలావస్థలకు చేరుకుంది. విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవటంతో నీరు వృథా కాకుండా కర్రలు అడ్డంగా పెట్టుకుని వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

బాధ్యతగా పశు గణన చేయాలి



సూచనలు చేస్తున్న నోడల్ అధికారి సత్యనారాయణ



ప్రాక్టికల్‌గా సర్వేచేసి చూపిస్తున్న అధికారులు

ఆమదాలవలస: ఎన్యూమరేటర్లు పశు గణనను బాధ్యతాయుతంగా చేసి, ఖచ్చితమైన గణాంకాలతో ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జి.నారాయణరావు సూచించారు. పట్టణంలోని పశు సంవర్ధక శాఖ ఏడీ కార్యాలయం వద్ద ఇటీవల నియమితులైన 9 మంది ఎన్యూమరేటర్లు, ముగ్గురు సూపర్‌వైజర్లకు నోడల్ అధికారితోపాటు, ఆమదాలవలస ఏడీ ఆర్.ఆనందరావు శనివారం శిక్షణ ఇచ్చారు. అలాగే పట్టణంలోని డాబాలవారి వీధిలో ఇంటింటికీ వెళ్లి పశు గణన ఎలా చేపట్టాలనేది ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 21వ పశుగణన కార్యక్రమం సెప్టెంబర్ 1వ తేదీ నుంచి డిసెంబర్ 31 వరకు జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో ఎచ్చెర్ల, ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలోని పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్‌ఐ ప్రవళ్లిక



పోలాకి: బాధ్యతలు చేపడుతున్న ఎస్‌ఐ రంజిత్

పోలాకి: స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐగా జి.రంజిత్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సత్యనారాయణను వీఆర్‌కు పంపించడంతో, ఆయన స్థానంలో మన్యం జిల్లా డీఎస్‌బీ నుంచి రంజిత్‌కు ఇక్కడ పోస్టింగ్ ఇచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్‌ఐ జిల్లా ఎస్పీ మహేశ్వరరెడ్డిని మార్యదపూర్వకంగా కలిశారు.

బూర్జ: బూర్జ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌ఐగా మొజ్జాడ ప్రవళ్లిక శనివారం బాధ్యతలు స్వీకరించారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.



విధుల్లో చేరిన బాలాజీ ప్రసాద్

ఆమదాలవలస: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై నెల్లిమర్ల నుంచి వచ్చిన పూజారి బాలాజీ ప్రసాద్ శనివారం విధుల్లో చేరారు. మున్సిపల్ సిబ్బంది ఆయనను ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులంతా ప్రభుత్వం నుంచి అందించాల్సిన సేవలు అందించాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఎల్.ఎన్.పేట: పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ సూచించారు. శనివారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని సూచించారు. తాగునీటి వనరులైన కుళాయిలు, బోర్లు, బావులు వద్ద మురికి నీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజల్లో అవగాహన కలిగించాలని సూచించారు.

సరుబుజ్జిలిలో భారీ వర్షం



సరుబుజ్జిలి జంక్షన్‌లో రహదారిపై వర్షపు నీరు



సారవకోట: వర్షపు నీటిలో తరగతి గదుల నుంచి బయటకు వస్తున్న విద్యార్థినులు

సరుబుజ్జిలి: మండలంలోని పలు ప్రాంతాల్లో శనివారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయం నుంచి వాతావరణంలో మార్పువచ్చి చిరుజల్లులతో ప్రారంభమై సాయంత్రానికి వర్షం జోరు పెరిగింది. రహదారులపై నీరు నిల్వ అవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సారవకోటలో...

మండలంలోని శనివారం కురిసిన వర్షానికి బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరింది. దీంతో విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. వర్షపు నీటిలోనే తరగతి గదులకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి వర్షపు నీటి నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

26 నుంచి జన్మాష్టమి వేడుకలు

హిరమండలం: మండలంలోని కూర్మ గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు 26, 27 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా సోమవారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హరే కృష్ణ, హరేరామ సంకీర్తనలు, శ్రీకృష్ణ భగవాన్‌కు హారతులు, ప్రవచనములు, నాటక ప్రదర్శక కార్యక్రమాలు జరపనున్నట్లు తెలిపారు. అలాగే 27వ తేదీ మంగళవారం అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం సంస్థాపకాచార్యులైన భక్తివేదాంత స్వామి ఆవిర్భావ మహోత్సవాన్ని జరుపునున్నట్లు తెలిపారు. వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే మామిడి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: మండలంలోని తామర గ్రామానికి చెందిన పద్దాన ధనలక్ష్మికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆర్థిక సాయం చేశారు. తామర గ్రామానికి వెళ్లి ధనలక్ష్మి తండ్రి పద్దాన పాల్గునరావు కుమార్తె వివాహం కోసం శనివారం నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కె.సంజీవరావు, నాయకులు ఇప్పిలి ధనుంజయ, వి.వెంకటరమణ, హెచ్.చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

హడావుడే తప్ప ఒరిగింది లేదు

- వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు మన్మథరావు



జలుమూరు: ఉపాధి నిధులతో పనులు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఆదరాబాదరాగా నిర్వహించిన గ్రామసభల వల్ల ఒరిగింది ఏమీ లేదని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు దామ మన్మథరావు అన్నారు. మండలంలోని పాగోడులో విలేకరులతో శనివారం మాట్లాడారు. ప్రతీ ఏడాది గాంధీ జయంతి పురస్కరించుకొని అక్టోబర్ 2వ తేదీన గ్రామసభలు నిర్వహించడం అనవాయితీగా వస్తోందని, ఈ సంప్రదాయం కాదని కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఇలా గ్రామసభలు పెట్టి కూటమి నాయకులు గొడవలు లేవనెత్తారన్నారు. గాంధీ జయంతి రోజున నిర్వహించాల్సిన ఈ సభలు ఇప్పుడు నిర్వహించడంలో అర్థం లేదన్నారు. అలాగే కొన్నిచోట్ల సర్పంచ్‌లను కాదని టీడీపీ నాయకులు అంతా తామే అనేల వ్యవహరించడం సరికాదన్నారు.

సెప్టెంబర్ 10 నుంచి గ్రిగ్స్ పోటీలు

పొందూరు: మండలంలో సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో గ్రిగ్స్ పోటీలు నిర్వహించనున్నామని ఎంఈవో పి.రాజారావు తెలిపారు. ఎమ్మార్సీలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 10న కింతలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు, 11వ తేదీ నుంచి ఖోఖో, టెన్నీకాయిట్, 12వ తేదీ నుంచి బాట్మింటన్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

గోనెపాడులో విద్యుత్ వెలుగులు

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు గ్రామంలో అంధకారం అలముకున్న నేపథ్యంలో 'అంధకారంలో గోనెపాడు' శీర్షికతో ఇటీవల సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో ఎనర్జీ అసిస్టెంట్ విద్యుత్ బల్బులు శనివారం ఏర్పాటు చేశారని సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సాక్షి పత్రికకు ప్రజలు తరుపున కృతజ్ఞతలు తెలిపారు.



గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులు

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన

హిరమండలం: పలు కారణాల వలన పాఠశాల స్థాయిలో నిలిచిపోయిన చదువులను ఓపెన్ స్కూల్ ద్వారా కొనసాగించవచ్చునని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. స్థానిక మండల కేంద్రంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల కోసం అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతీ వ్యక్తి కనీసం ఇంటర్మీడియట్ విద్య పూర్తి చేయాలని సూచించారు. చదువు మధ్యలో మానివేసినవారు ఓపెన్ స్కూల్ ద్వారా చదువులు కొనసాగించవచ్చునన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు ఈనెల 28 వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు. సీఆర్‌ఎంటీలు, సచివాలయ ఉద్యోగులు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పెంచాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పుస్తకాలు వచ్చాయి

నరసన్నపేట: మండలంలోని 82 పాఠశాలల విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలు శుక్ర, శనివారాల్లో మూడు విడతలుగా చేరుకున్నాయి. మొత్తం 13,100 పుస్తకాలు వచ్చినట్లు ఎంఈవో పేడాడ దాలినాయుడు తెలిపారు. వీటిని ఆయా స్కూల్స్‌కు తరలిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఉపాధ్యాయులు కూడా వీటి ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియచేయాలన్నారు.



పుస్తకాలను అన్‌లోడ్ చేస్తున్న దృశ్యం

అజోల్లాతో ప్రయోజనాలు



నీమాస్త్రం తయారు చేస్తున్న దృశ్యం

కొత్తూరు: అజోల్లాతో పంటలకు ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని గొట్టిపల్లిలో పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు చిరంజీవి పొలం వద్దకు రైతులు చేరుకుని పొలంబడి చేపట్టాడు. పొలంలో ఆకుముడత తెగుళ్లను గుర్తించారు. ఆకుముడత తెగుళ్ల నివారణకు అవసరమైన నీమాస్త్రంను పొలం వద్ద తయారు చేసి పంటలో పిచికారీ చేయించారు. అదే విధంగా వరి పొలంలో రెండు కిలోల అజోల్లాను రైతులు చేత వేయించారు. అజోల్లా వలన భూమిలో తేమ తగ్గకుండా ఉంటుందన్నారు. వాతవరణంలో ఉన్న నత్రజని భూమిలోకి తీసుకొని స్థిరీకరిస్తుందన్నారు. కార్యక్రమంలో వీఏఏ శశిధర్, వెలుగు ప్రాజెక్టు అధికారి హరీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..!



పలాస వెళ్లే ముఖ్య రహదారిలో చాపర గ్రామం వద్ద జీడి పరిశ్రమలు ఉన్న ప్రదేశంలో రహదారిపై ఏర్పడిన ఒక గుంత నిత్యం ప్రమాదాలకు కారణమవుతోంది. ఇటీవల పలువురు వాహనదారులు రాత్రివేళ ఆ ప్రదేశంలో ప్రమాదానికి గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. రహదారిలో ఏర్పడిన గుంతను చూస్తే సంబంధిత శాఖా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది. కనీసం ఎటువంటి ప్రమాద హెచ్చరిక సైతం ఏర్పాటు చేయకుండా వ్యవహరించడంతో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొంతమంది స్థానికులు గుంత ఉన్నచోట కొబ్బరి రేకులు వేశారు. అయినప్పటికీ ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు. దీనిపై అధికారులు దృష్టి సారించి మరమ్మతులు చేయాలని, కనీసం సూచిక అయినా ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి